# ప్రతిఫలం



కొఠారి వాణీచలపతిరావు.

సాయంత్రం ఆరుగంటలైంది.

ఆఫీసునుండి వస్తూ స్కూలుకు వెళ్ళి నాలుగేళ్ళ 'స్వర్ణను తీసికొని ఇంటికి వచ్చారు కిరణ్, రచన.

రచన తాళం తీస్తూ ఉంటే-

కిరణ్ లెటర్ బాక్స్ ఓపెన్ చేసి చూసాడు-

'ఎక్కడి నుండి లెటర్?'' అంది రచన.

''నాన్న రాసారు. అమ్మకు ఆరోగ్యం సరిగాలేదట. డాక్టరుకు చూపించాలని రేపు ఇద్దరూ ఇక్కడికి వస్తున్నారు. స్టేషన్‌కి రమ్మని రాసారు'' అన్నాడు కిరణ్.

ఆ మాటలంటున్నప్పుడు అతని ముఖం గంభీరంగా మారిపోయింది. పైకి మాత్రం మామూలుగా కనిపించడానికి ప్రయత్నించాడు.

అత్తగారు, మామగారు వస్తున్నారనగానే రచన గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. ఏవో పనులమీద ఐదారు నెలల కోసారి పట్నం వచ్చి పది, పదిహేను రోజులుండి వెళ్ళే అత్తగారు, మామగారు లోగడ మిగిల్చివెళ్ళిన అనుభవాలు గుర్తురాగా రచన ఉదాసీనంగా ఉండిపోయింది.

తన ఇంట్లో తను పరాయిదైనట్లు, తన నీడను చూసే తను భయపడుతున్నట్లు అనిపిస్తుంది వాళ్ళు ఉన్నన్ని రోజులూ. రోజులు యుగాల్లా భారంగా నత్త నడక నడుస్తున్నట్లు భావన కలుగుతుంది.

అప్రయత్నంగా తనలో కలిగిన ఆలోచనకు ఆ తరువాత తనలో తనే నొచ్చుకుంది రచన. కష్టమైనా, నిష్ఠూరమైనా, వాళ్ళ స్వభావాలు ఎటువంటివైనా తన భర్త తల్లిదండ్రులుగా వాళ్ళని గురించి తను అలా ఆలోచించకూడదు అనుకుంది.

ఆ మర్నాడు-

తెల్లవారినప్పటినుండీ తెగ హడావుడి పడిపోతూ ఇల్లు సర్దడం, వంట చేయడం వంటి పనులు చేస్తున్నది రచన. భార్య హడావుడి గమనించి ''ఈ రోజు ఆఫీసుకు రానట్టేనా?'' అని ప్రశ్నించాడు కిరణ్.

''ఎలాగండీ? ఈ రోజు మీ అమ్మ, నాన్న వస్తున్నారు కదా? ప్రయాణం చేసి వచ్చిన వాళ్ళకు ఇంటికొచ్చే సరికి మంచినీళ్ళు ఇచ్చే దిక్కు కూడా లేకుంటే ఏం బాగుంటుంది? అలసిపోయి వచ్చిన వాళ్ళకు దగ్గర ఉండి అన్నం వడ్డించకపోతే ఏం మర్యాదగా వుంటుంది?'' అంది రచన.

''నీ ఇష్టం. అయితే వెళ్తున్నాను'' అన్నాడు కిరణ్ క్లుప్తంగా.

''స్టేషన్‌కి వెళ్ళటం మర్చిపోకండి. ఆఫీసు పనిలో పడితే గుర్తుండదు అనుకుంటే ఇప్పుడే చెప్పండి. పక్కింట్లో నుండి ఫోను చేసి గుర్తుచేస్తాను.''

''అవసరం లేదులే. గుర్తుంటుంది.''

''తప్పకుండా వెళ్ళండి. లేకుంటే మీ నాన్నగారికి కోపం వస్తుంది'' అని మరొకసారి భర్తకు చెప్పి లోపలికి వచ్చింది రచన.

నరిగ్గా మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దం అయింది.

చేస్తున్నపని వదిలేసి మర్యాదపూర్వకంగా గేటు వరకు వెళ్ళింది రచన.

చంకలో గొడుగు, చేతిలో సూట్‌కేసుతో మామగారు, రెండు చేతులతో రెండు టిఫెన్లు మోయలేక మోస్తూ అత్తగారు ఆటోదిగుతూ కనిపించారు. మీటరు చార్జి చూసి ఆటోవాడికి డబ్బులిచ్చి పంపించాడు కిరణ్.

ఎదురువెళ్ళి అత్తగారి చేతిలోని స్టీలు టిఫెను కారియర్ అందుకుంటూ ''బాగున్నారా అత్తయ్యా?'' అని కుశల ప్రశ్నలు వేసింది రచన.

తన దీర్ఘకాయాన్ని అతి భారంగా, ఆయాసపడుతూ కుర్చీలో చేరవేసి ''అబ్బ! ఏం బాగో. కాస్త నడిస్తే ఆయాసం. గుండెల్లో దడ. బి.పి.ఉందని అంటున్నారు అక్కడి డాక్టర్లు. ఏవో పరీక్షలు చేయాలట. అవన్నీ మీ మామగారికేం తెలుస్తాయి? ఇక్కడయితే కిరణ్ ఉన్నాడు కదా అన్నీ వాడే చూసుకుంటాడని వచ్చేసాను'' అంది రచన అత్తగారైన కనకదుర్గమ్మ గారు.

''కాళ్ళు కడుక్కోండి. భోజనం చేద్దురుగాని'' అన్న కోడలి మాట, ఆకలితో ప్రాణాలు అడుగంటి పోతున్న ఆమె చెవులకు నాగస్వరంలా వినిపించింది.

''ఈ రోజైనా ఇంట్లో ఉంటావో, ఆఫీసుకెళ్ళిపోతావో అని హడలి చచ్చాను. ప్రయాణంలో ఒళ్ళు హూనం చేసుకుని అలసట, ఆకలితో ఇల్లు చేరితే పలకరించే దిక్కుకూడా లేకుంటే ఎందుకొచ్చామా? అని ప్రాణం ఉసూరుమని పిస్తుంది.''

''ఆఫీసులో ఏదైనా ముఖ్యమైన పని ఉంటే తప్ప, మీరు వస్తున్న రోజు సామాన్యంగా శెలవు పెడతాను

*గమనిక: ఏ సమస్యనైనా రెండు వైపుల నుండీ చూడాలను కోవటం, ప్రస్తుత సమాజంలో ఇలాంటి తల్లిదండ్రులు కూడా ఉన్నారని చెప్పటమే ఈ కథ ఉద్దేశం గానీ పెద్దలను కించపరిచే ఉద్దేశం కాదు. ఇదే సమస్యను తల్లిదండ్రుల పక్షం నుండీ మొదట ఆలోచించి 'తోడు' అన్నపేరుతో ఒక కథ రాసాను. ఆ కథ 'వనిత' లోనే జూలై 1991 సంచికలో ప్రచురితమైంది. ఆ, కథను, ఈ కథను, పక్క పక్కన పెట్టి చదివితే నా నిష్పక్షపాత వైఖరి అర్థమవుతుంది.*

*రచయిత్రి*

అత్తయ్యా!" అంది రచన, అత్తగారికి, మామగార్కి నెయ్యి వడ్డిస్తూ.

"ఏం ఉద్యోగాలో ఏమిటో? ఉద్యోగం చేస్తున్న పిల్ల మనకొద్దురా అంటే వినకుండా నిన్ను పెళ్ళి చేసుకున్నాడు. ఇంటి పట్టున ఉండి కమ్మగా వండి పెట్టే ఆడది ఉంటే ఎంతైనా మగవాడికి ఆ సౌఖ్యమే వేరు. పిల్లను పరాయివాళ్ళ కప్పగించడం, మీరిద్దరూ అస్తమానం చెరొక ఆఫీసుకు అంటుకొని పోవడం. ఇంటికి ఓ చుట్టమో, పక్కమో వచ్చాడంటే ఇక వాడి గడ్డివాడు కరవాల్సిందే.." అంది కనకదుర్గమ్మ వచ్చినప్పటి నుండీ వదలిపెట్టకుండా గలగలా మాట్లాడుతూ.

అంత వరకూ తలవంచుకుని భోజనం చేస్తున్న అచ్యుతరామారావ్‌గారు "నీకెందుకే అవన్నీ. నువ్వు చెప్పినట్లు వినటానికి వాళ్ళు ఇంకా చిన్నపిల్లలా ఏమిటి? అయినా పెద్దలు చెబితే పిల్లలు వినేరోజులు ఎప్పుడో పోయాయి. ఇప్పుడు ఎవరి సంసారాలు వారివి? ఎవరి ఇష్టా యిష్టాలు వారివి. నాలుగు రోజులు చుట్టపు చూపులా చూసిపోదామని వచ్చిన దానివి. నీకెందుకు అవన్నీ" అన్నాడు భార్యను మందలిస్తున్న ధోరణిలో. మామగారి మాటలకు మనను చివుక్కుమన్నా ఆయన ధోరణి అలవాటయిందే కనుక మౌనం వహించింది రచన.

రెండు రోజుల వరకు డాక్టర్లు, టెస్టులు అంటూ హాస్పటల్ చుట్టూ తిరగడమే సరిపోయింది కిరణ్‌కు. దాంతో ఆఫీసుకు సరిగా పోలేకపోయాడు.

"ఆఫీసు పనంతా ఎక్కడిదక్కడే ఉండిపోయింది. ఎల్లుండి 'ఆడిట్' కూడా ఉంది. ఈ రోజు ఆఫీసరుతో తిట్లుతప్పవు" మాస్ వేసుకుంటూ ఆఫీసుకు సిద్ధమవుతున్న కిరణ్ గొణుక్కున్నాడు.

కోడలు ఇచ్చిన 'కాఫీ' గుటకలు వేస్తూ తాగుతున్న అచ్యుత రామారావ్‌గారు అకాల మేఘంలా విరుచుకుపడ్డారు ఆ మాటలకు.

"ఎందుకురా అంత విసుగు, కోపం. ఎవరికో పరాయి వాళ్ళకు చేస్తున్నట్లు అలా బాధపడిపోతావేమిటి? పెద్దవాడవై నీకూ ఇల్లూ, పెళ్ళాం వచ్చేసరికి 'కన్నతల్లి' పనికి రాకుండా పోతోందా? కన్నకొడుకుగా తల్లికి, తండ్రికి సేవచేయాల్సిన బాధ్యత నీకులేదా?" అన్నారు నిష్ఠూరంగా.

అనవసరంగా తండ్రికి అంత కోపం ఎందుకొచ్చిందో, ఇప్పుడు తనేం తప్పు మాట్లాడాడో అర్థంకాక తికమకపడిపోయాడు కిరణ్. అంతలోనే కనకదుర్గమ్మ తనూ కల్పించుకుంది.

"ఊరుకోండి. వాడినెందుకంటారు. అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలొచ్చాక బిడ్డలా అన్నారు అందుకే. ఎప్పుడో చిన్నప్పుడు తాగాడు వాడు తల్లిపాలు. ఇంకా గుర్తు ఉంటాయా?"

"ఇప్పుడు నేను ఏమన్నానని మీరిద్దరూ అలా నిష్ఠూరాలాడుతున్నారు. ఆఫీసులో పని ఉందని అనుకోవడం కూడా తప్పేనా?" చీటికీ మాటికీ పాతకాలం సామెతలు వాడుతూ తాము వాళ్ళనేదో బాధలు పెడుతున్నట్లు 'సీన్' క్రియేట్ చేయడం చికాకు కలిగించడంతో బిగ్గరగానే అన్నాడు కిరణ్.

"ఇందాకనే ఆఫీసుకు టైమ్ అయిందన్నారు. ఇంకా వెళ్ళరేంటి. తొమ్మిదిన్నర కూడా అయింది." అంది గోడగడియారం వంక చూస్తూ.

"నువ్వు రావా?" అన్నాడు కిరణ్ భార్య వంక చూస్తూ. "ఈ రోజు నేను కాస్త లేట్‌గా వెళ్తాను. నిన్ననే పర్మిషన్ తీసుకున్నాను" అంది రచన భర్తకు బ్రీఫ్‌కేస్ అందిస్తూ.



## స్త్రీ భార(జీవి)తం

కట్నాల ఊబిలో
కష్టాల అంచులో
కరిగి చెరిగి పోయే
ఒక కర్పూర కన్య
తన కన్నీటి మడుగులో
సృష్టిని కడుగుతూ —
కాగితం పడవ మీద
కలియుగాన్ని దాటిస్తూ
పేగులో ప్రేమనీ
గుండెల్లో ఊపిరినీ
జన్మ మర్మాన్నీ
జాతి ఖర్మాన్నీ
నాటి నుండీ నేటి వరకూ
భరిస్తూ,
సహిస్తూ,
దహించుకుపోతూనే వుంది
అందుకే — ఇది స్త్రీ భార(జీవి)తం

—నిర్మలా జాలాది.

"ఇద్దరూ ఇద్దరే తోడు దొంగలు. ఒకళ్ళనొకళ్ళు మాటపడనివ్వరు. వాడ్ని నేనేమైనా అంటానేమోనని ఎలా మధ్యలో దూరి మాట మరిపించేలా చేసిందో చూసావా? ఎంతైనా చదువుకున్న కోడలుకదా. అందులో ఉద్యోగస్తురాలు కూడాను. ఆ తెలివితేటలు మనకు ఎక్కడి నుండి వస్తాయి?" అన్న అత్తగారి నిష్ఠూరాలూ వంటింట్లో నుండి విన్న రచన కు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

'చదువుకున్న దయినంత మాత్రాన తను వాళ్ళకి 'మర్యాద'లో లోపం చేస్తున్నది? 'అత్తమామలని' తన బాధ్యతను, వాళ్లకు ఇవ్వవలసిన గౌరవాన్ని గుర్తించి ఎంత జాగ్రత్తగా మసలుకున్నా ఏదో ఒకటి అంటూ ఉంటారు. ప్రతి మాటలోను వ్యంగ్యం, దెప్పిపొడుపు కొట్టవచ్చినట్లు కనబడుతుంటాయి. అంత పెద్దవాళ్ళు అనుభవజ్ఞులు అయి కూడా చిన్నవాళ్ళ 'అవసరాలను, మనసును అర్థం చేసుకోకుంటే ఎలా?' అనుకుంది రచన.

"ఏం కూర చేస్తున్నావమ్మాయి?" అంటూ నడుముకు చెయ్యిపెట్టుకుని లోపలికి వచ్చిన అత్తగార్ని చూడగానే "ఖంగారుగా తన మనసులోని భావాలను కప్పిపుచ్చేసింది రచన.

"వంకాయ కూర, దోసకాయ పచ్చడి, పులుసు చేస్తున్నాను అత్తయ్యా!" అంది వంకాయ ముక్కలు పోపునవేస్తూ.

"నువ్వుల కారం కూరి, దారాలు కట్టి నూనెలో వేయిస్తే బాగుంటుంది. దోసకాయ ఆవబెట్టి చెయ్యక పోయావా మీ మామగారికి ఇష్టం" ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయింది రచన. అలాంటి స్పెషల్ వంట కాలన్నీ సెలవు రోజు తప్ప ఉరుకుపరుగులతో 'పని' సాగే వర్కింగ్‌డే రోజు కుదరవు. ఆ విషయాలన్నీ ఆవిడకు చెప్పినా అర్థంకావు. కనుక మౌనంగా ఉండటమే బెటర్.

"ఏదో మేమూ పెద్దవాళ్ళ మయిపోతున్నాం. జిహ్వాచాపల్యం చావక కాస్త రుచిగా నోటికి తినాలనిపిస్తుంది. నాలుగురోజులు కాస్త రెస్ట్‌గా కూర్చుని కోడలి దగ్గర తిందామని వస్తే..నీకూ తీరిక, ఓపిక ఉండవాయె. .ఎంతైనా వెనకటితరం కోడళ్ళేమేలు. అత్తమామల సేవ చేయడం పుణ్యకార్యంగా భావించే వాళ్ళు. పెద్దవాళ్ళంటే భయం, భక్తీ కూడా ఉండేవి. ఆ రోజుల్లో అత్తగార్లు కూడా ఎలా ఉండేవారని గద్దరితనంతో కోడళ్ళని రాచిరంపాన పెట్టేవాళ్ళు. మా అత్తగారితో నేను ఎన్ని బాధలు పడ్డానో నీకేం తెల్సు? చచ్చి ఎక్కడుందో గానీ మహాతల్లి నన్ను ఒక ఏడ్పు ఏడ్పించిందా?.."

మౌనంగానే అత్తగారి మాటలన్నీ ఒక పక్క ఓర్పుగా వింటూ, మరోపక్క ఆఫీసు గురించి ఆలోచిస్తున్నది రచన.

"అవునుగానీ అమ్మాయ్! నీకు జీతం ఎంతొస్తుందే?"

"రెండువేలు వస్తుంది అత్తయ్యా!"

"అమ్మో! రెండువేలే. ఏం చేస్తున్నావే అంత డబ్బు. ఏమైనా కూడబెట్టావా? వాడికి తెలియకుండా ఏ నగో, నట్రో చేయించుకోకపోయావా? చేయించుకునే ఉంటావులే. చీరలు కూడా బాగానే కొన్నట్టున్నావ్. రోజుకో చీర ఆఫీసుకు కట్టుకెళ్తుంటే కనబడుతూనే ఉన్నాయిగా. అప్పుడు నువ్వు పెట్టిన గుంటూరు జరీచీర నీళ్ళలో వేయగానే రంగుపోయింది అమ్మాయ్. ఈసారి ఎలాగైనా 'గద్వాల' చీర కొనిపెట్టాలి. ఇద్దరూ సంపాదిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారైనా తల్లికి అనువైన చీరపెట్టాలని మగవాడు గనుక వాడికెలాగూ తెలియదు. ఆడవాళ్ళకయినా మర్యాదలు, మన్ననలు తెలియకపోతే ఎలా?"

ఇకనైనా నోరు విప్పక తప్పదని అనుకుంది రచన "సిటీలలో ఎంత వచ్చినా సరిపోదత్తయ్యా. ఇంటి కిరాయి, కిరాణా కొట్టు బిల్లు, పిల్ల స్కూలు ఖర్చులు పోను పాలు, పనిమనిషి, చాకలి ఇలా ఎన్ని ఖర్చులో. ఇవన్నీగాక ప్రతినెలా ఏవో ఒక ఎక్స్‌ట్రా ఖర్చులు" అంది.

"ఆ ఖర్చులన్నీ మాకు మాత్రంలేవా? ఈ మధ్య వ్యవసాయం ఖర్చులు కూడా చాలా పెరిగిపోయాయి. పంట చూస్తే పెట్టుబడి మందమే తప్ప మిగిలిచచ్చేది ఏమీ కనిపించటంలేదు. ఎంతైనా బస్తీలలో ఉండి ఉద్యోగాలు చేసుకునే వాళ్ళపనే హాయిగా ఉంది. ఫస్టు వచ్చేసరికి ఇన్ని డబ్బులు చేతులో పడతాయని లెక్క అయినా ఉంటుంది." అంది కనకదుర్గమ్మ తమాషాగా చేతులు తిప్పుతూ.

ఎక్కడి ఖర్చులు అక్కడే, ఎక్కడి సాధకబాధకాలు అక్కడే ఉన్నాయి. నిజమే. కానీ ఏనాడూ 'ఇవి మనచేలో పండినవి' అని బియ్యం, పప్పులు కూడా ఆమె పంపించి ఎరగదు. ఏదో కళ్ళనీళ్ళు తుడవటానికి అన్నట్లు అప్పడాలు, వడియాలు, ఉప్పుమిరపకాయలు, పచ్చళ్ళు వంటివి తేవడం తప్ప. కొడుకు బాధ్యతలను మాటిమాటికి గుర్తుచేయడం తెలిసిన వాళ్ళకు తల్లిదండ్రులుగా తమకూ కొన్ని బాధ్యతలుంటాయని తెలియదా? 'అనుకుంది రచన. ఆమె మొదటి నుండీ బాధ్యతారహితమైన మనిషే అని ఒక్కోసారి ఆమె మాటల వల్లే ద్యోతకమయ్యేది. తను స్వర్ణ కు వెంటబడి బ్రతిమిలాడి అన్నం తినిపించడం, బలవంతంగా కూర్చోబెట్టి హోంవర్క్‌లు

చేయించడం, మాటిమాటికి నీటెనెస్, డిసిప్లిన్ అంటూ మంచి బుద్ధులు చెప్పడం ఇవన్నీ చూస్తున్న అత్తగారు, 'నీకు మరీ చాదస్తం. ప్రతిదానికీ పట్టింపులు. దాన్నెందుకలా ఊపిరినలవనీయకుండా చేస్తావ్. ఈ వయినాలు నా దగ్గర పనికిరావు. పిల్లల చిన్నప్పుడు నేనయితే ఇంత అన్నం కలిపి ముందు పెట్టేదాన్ని తిన్నంత తిని మిగిలింది పారేసేవాళ్ళు. అయినా వాళ్ళ ఆలనా పాలనా అంతా పనిమనిషే చూసేది.' అన్న అత్తగారి మాటల్ని బట్టి ఆమె నిర్లక్ష్య ధోరణి అర్థం చేసుకునేది రచన.

వంట పని కాగానే చకచకా తయారై చీరమార్చుకొని, అలమారా తాళం తీసి హ్యాండ్ బ్యాగ్ తీసుకుని ఆఫీసుకు బయలుదేరింది రచన.

"అమ్మాయ్! నువ్వు ఆఫీసు నుండి వచ్చేటప్పుడు ఇదిగో ఈ మందులన్నీ కొనుక్కొని రా. మీ అత్తగార్కి నిన్న డాక్టర్ రాసిచ్చినవి." అంటూ ప్రిస్క్రిప్షన్ కోడలి చేతులో పెట్టారు అచ్యుతరామారావుగారు.

"అలాగే" అంటూ ప్రిస్క్రిప్షన్ బ్యాగ్‌లో వడేసుకొని ఆఫీసుకు బయలుదేరింది రచన.

* * * *

నాణానికి బొమ్మా బొరుసూ రెండూ ఉన్నట్లు, ప్రతి సమస్యకూ రెండు పక్కలు' ఉంటాయి. ఏ సమస్య నయినా ఎప్పుడూ ఒకే రీతిగా ఆలోచించడం, ఒకే మూసలో పోసి కరిగించినట్టుండే నిర్ణయాలు తీసుకోవడం మనకు బాగా అలవాటైపోయింది.

లోకంలో మంచి, చెడులు అందరిలో ఉంటాయి. కనుక పెద్దవాళ్ళంతా మంచివాళ్ళు, పిల్లలంతా చెడ్డవాళ్ళు అనిగానీ చిన్నవాళ్ళంతా మంచి వాళ్ళు పెద్దలు చెడ్డవాళ్ళు అనిగానీ మూకుమ్మడి అభిప్రాయాలు తీసుకుని గుడ్డిగా నిర్ణయాలు చేయడం న్యాయం కాదు.

స్వార్థంతో బాధ్యతలు మర్చి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే కొడుకులు ఉన్నట్లే, 'హక్కుల' పేరిట శక్తిని మించిన బరువును భుజాల మీదవేసి కొడుకులను పీడించుకు తినే తల్లిదండ్రులూ ఈ లోకంలో ఉన్నారు. ఇదంతా వారి వారి స్వభావాలను బట్టి ఉంటుంది. అవగాహనా లోపం ఎవరిలో ఉన్నా కుటుంబాలలో అశాంతి, మనస్తాపం చోటు చేసుకుంటాయి.

కోడలు ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుండి కొడుకు తనకు కాకుండా పోతున్నాడని ఓ తల్లి ఎలా బాధపడుతుందో, తన భార్య వచ్చినప్పటి నుండి తన తల్లి తనను పరాయివాడిగా చూస్తున్నదని, తన భార్యని ఆమె ఓ శత్రువుగా భావిస్తున్నదని ఆ కొడుకూ బాధపడవచ్చుకదా. ఇంట్లో మనస్పర్థలు చెలరేగినప్పుడు తల్లి, భార్య అనే రెండు ముఖ్యమైన బంధాల మధ్యపడి ఆ మగవాడి ప్రాణం ఎలా నలిగిపోతుందో ఆలోచించగలిగిన వాళ్ళకు ఇట్టే అర్థమైపోతుంది. అసలు నిజం ఆలోచిస్తే దీనికంతటికీ కారణం మనసుకీ మనసుకీ మధ్య ఉండాల్సిన ప్రేమ, స్వార్థం వెనకబడి మరుగైపోవడమే. ఎవరికి వారే తాము నిర్వహించిన బాధ్యతలకు వెలగట్టి అణాపైసలతో సహా తిరిగి హక్కుల పేరిట వసూలు చేయాలని చూడటమే. కొడుకును పెంచి పెద్ద చేసినందుకు అయిన 'ఖర్చు'ను, అతడు సంపాదన పరుడైన తర్వాత తిరిగి ఎలా వసూలు చేయాలా అని లెక్క వేసే తల్లిదండ్రులు కనిపించినప్పుడు వాళ్ళ లోపల దాగి ఎండి బీడులైన హృదయాలను మనం నిస్సంకోచంగా చూడవచ్చు.

పెరిగి పెద్దయి స్వతంత్రుడై, తన కాళ్ళ మీద తను నిలబడగలిగిన కొడుకు, తల్లికి కొంత దూరం

## లోకజ్ఞానం

1. మన దేశంలోని ఒక ఊరిలో యింటింటా ఒక నాగుపాముని పెంచుతారు. ఆ ఊరేదో చెప్పగలరా?
2. ఎలుకలను పోషించే దేవాలయం ఒకటుంది. అదెక్కడుందో తెలుసా?
3. కాళిదాసుకు పూర్వమే నాటక రచన ప్రారంభించిన వ్యక్తి ఎవరు?
4. భారతదేశపు ప్రథమ కథా సంకలనం ఏది?
5. మన దేశంలో ప్రఖ్యాతి పొందిన నృత్య రీతులు ఏవి?
6. 'అగోచర సామ్రాజ్యం' ఎక్కడ ఉంది?
7. భారతీయ లాక్షణికులు పేర్కొనే నవరసాలు ఏవి?

### లోకజ్ఞానం - సమాధానాలు

1. షెట్‌పాల్ గ్రామం. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఉంది.
2. రాజస్థాన్‌లోని దేశ్‌కోన్ గ్రామంలో ఉంది. అక్కడి ఆరాధ్య దేవత కార్నిదేవి. చరన్ తెగవారు మరణించిన తమ వంశస్థులు మరో జన్మనెత్తే వరకూ ఎలుకలుగా ఉంటారని నమ్ముతారు.
3. భాసుడు. క్రీ.పూ 4 వ శతాబ్దికి చెందినవాడు. 1812 లో వెలుగులోకి వచ్చిన నాటకాలలో కనీసం 14 నాటకాలకు రచయిత.
4. గుణాఢ్యుని 'బృహత్కథ'. ఇది పైశాచిక భాషలో ఉంది. ఆ గ్రంథము, ఆ భాషా ప్రస్తుతం అలభ్యమైనవే. ఐతే సోమదేవుని 'కథాసరిత్సాగరం' - బృహత్కథలోని ఒక భాగానికి సంస్కృతానువాదం.
5. కథక్, భరతనాట్యం, కథకళి, ఒడిస్సి, మణిపురి, కూచిపూడి.
6. హిమాలయాలలోని జాన్స్కార్ కనుమ ప్రదేశాన్ని 'అగోచర సామ్రాజ్యం' అంటారు. ఈ కనుమ పర్వత శ్రేణులచే కప్పబడి, దాటడానికి అసాధ్యంగా ఉంటుంది. రెండు సన్నని మార్గాలు ఈ ప్రదేశాన్ని భారతదేశంతో కలుపుతున్నాయి.
7. కరుణ, హాస్యము, శృంగారము, రౌద్రము, వీరము, భయానకము, భీభత్సము, అద్భుతము, శాంతము.

కావటం సహజమే. కానీ ఆ దూరం మానసికంగా కాకూడదు.

ఉదయం తండ్రికీ, తనకూ మధ్య జరిగిన ఘర్షణ 'కిరణ్'లో ఆలోచించిన కొద్దీ చిరాకు కలిగిస్తున్నది.

ఉదయం ఆఫీసుకెళ్తూ "నాన్నా! మీ దగ్గర ఓ రెండు వందలు ఉంటే ఇవ్వండి. చేతిలో ఈ రోజు అస్సలు డబ్బులు లేవు." అని అడిగాడు కిరణ్.

"నేను, మీ అమ్మ వచ్చి డాక్టరు ఖర్చులు, మందు ఖర్చులు నీతో పెట్టించామనేగా, నా డబ్బులు నా కియ్యమన్నట్లు అడుగుతున్నావ్? నీపెళ్ళాం చెప్పిందా అడగమని. మేము మాటి మాటికీ వచ్చి తినిపోతున్నామని ఆవిడగారికి కష్టంగా ఉన్నట్లుంది. అలాంటి దేమైనా ఉంటే ముఖాన్నే చెప్పెయమను. మళ్ళీ నీ ఇంటి గుమ్మం తొక్కను. ముగ్గురు కొడుకులు ఉన్నారనే గానీ ఎవరింటికి పోయినా ఇదే తీరు. అమ్మకు, నాన్నకు అన్నం పెట్టినందుకు కూడా ఖరీదు కడుతున్నావన్న మాట." అన్నారు అచ్యుత రామయ్యగారు కొడుకు వంక తీక్షణంగా చూస్తూ.

"ఎందుకు నాన్నా చిన్న విషయానికి నానా రభస చేస్తారు. డబ్బులు అవసరం ఉండి, కన్నతండ్రి ఉండగా పరాయివాళ్ళను అడుక్కోవడం ఎందుకని అడిగాను. దానికి ఇంత చదువుతారని తెలిస్తే అసలు అడిగేవాడినే కాదు." చిరాకుగా అన్నాడు కిరణ్.

"ఇద్దరు సంపాదిస్తున్నారు. అయినా ఇంట్లో డబ్బులు లేవంటే నమ్మడానికి నేనేమయినా వెర్రి వెంగళాయి ననుకున్నావా? మమ్మల్ని వెళ్ళగొట్టడానికి ఇదో వేషం." నిరసనగా అన్నారు అచ్యుత రామారావ్‌గారు.

అక్కడే గోడకానుకుని కూర్చొని వత్తులు చేసుకుంటున్న కనకదుర్గమ్మ ఆ తండ్రీ కొడుకుల వాదనను ఆటంకపరిచే ఉద్దేశంతో అన్నట్లుగానే మరో చురక అంటించింది.

"ఇంక ఊరుకోండి ఎందుకు లేనిపోని గొడవ, కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. ఇలాంటి కొడుకుల గురించి ఎన్ని కథలు చదవటంలేదు. ఎన్ని సినిమాలు చూడటం లేదు. అలాంటి నిర్భాగ్యపు తల్లిదండ్రులలో మనమూ ఒకళ్ళం. కొడుకులు ఏదో ఉద్ధరిస్తారని గంపెడాశ పెట్టుకుని రావడం మనదే బుద్ధి తక్కువ." అంది మండుతున్న మంటలో మరి రెండు కట్టెలు వడేస్తూ.

వాళ్ళ మాటలకు చిరాకుతో పాటు ఆశ్చర్యం కూడా కలిగింది కిరణ్‌కు. పట్నం తీసుకొస్తే వైద్యానికి డబ్బు ఎక్కువ ఖర్చవుతుందని పల్లెటూర్లో నాటువైద్యాలు చేయించి తాతయ్య చావుకు కారణం అయిన తండ్రి, పక్షవాతంతో మంచానపడ్డ బామ్మను రోజూ సూటిపోటి మాటలతో, తిట్లతో బ్రతికుండగానే శవంగా మార్చిన తల్లి ఇప్పుడు ఏ ధైర్యంతో ఇన్ని మాటలంటున్నారో అర్థం కాలేదు. అయినా వాళ్ళ మనస్తత్వం తెలినుండీ వాళ్ళను డబ్బులడగటం తనదే బుద్ధి తక్కువ 'కొడుకుగా నీదే బాధ్యత' అన్నట్లు జేబులో వెయ్యి రూపాయలున్నా బైటికి ఒక్క రూపాయ తీసి ఖర్చుపెట్టని నాన్న తనకు చెందాల్సిన హక్కుల గురించే తప్ప తండ్రిగా తన అవసరాలను, ఇబ్బందులను గుర్తించని నాన్న గురించి ఈ రోజు తను తప్పు అంచనా వేసాడు' అనుకుంటూ విసురుగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు కిరణ్.

ఆ సంభాషణవిన్న రచన మనసంతా చేదుగా మారిపోయింది. ఏ విషయాన్నయినా మనసులోనే ఉంచుకొని తనలో తానే బాధపడటం తప్ప ఏనాడూ పెదవి విప్పి మాట్లాడి ఎరుగదు 'రచన'. కన్నకొడుకు కష్టసుఖాలనే అర్థం చేసుకోలేని వాళ్ళు ఇక కోడలి గురించి ఆలోచించే ప్రయత్నం అయినా చేస్తారని అనుకోవడం వెర్రిభ్రమ. పిల్లలకు మార్గదర్శకులు కావాల్సిన తల్లిదండ్రులే, పిల్లలు తప్పు చేస్తే మందలించాల్సిన పెద్దలే చిన్న మనసుతో ఆలోచిస్తుంటే ఇక సమాజాన్ని ఎవరు సరిదిద్దుతారు? వృద్ధాప్యం. పెద్దతనం అనేవి కేవలం వయసుకొస్తే సరిపోవని, మనసుకు కూడా రావాలని చిన్న వాళ్ళు చెబితే వాళ్ళని అగౌరవ పరిచినట్లు ఉంటుంది. అవమానించినట్లు అవుతుంది. 'పెద్దలంటే గౌరవం లేకుండా పోతున్నదని' నలుగురూ ఆ చిన్నలనే నిందిస్తారు. కనుక పిల్లలు పెద్దలకు చెప్పకూడదు. మరి పెద్దలకు ఎవరు చెప్పాలి? ఒకరితో చెప్పించుకోవాల్సిన వయసు దాటిపోయిన వాళ్ళకు ఎవరు చెప్పినా బాగుండదు. కనుక పెద్దలూ! మీరే ఆలోచించండి. పిల్లల మనసులతో పాటు నేటి దేశ కాల పరిస్థితులను కూడా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి.